దిగుబడిపై దిగాలు!

- వాతావరణ మార్పులతో పంటల సాగుపై తీవ్ర ప్రభావం
- అదును దాటిన తర్వాత కురిసిన వర్షాలు
- మార్కాపురం సబ్ డివిజన్‌లో 15,710 హెక్టార్లలో పంటల సాగు
- చుట్టుముట్టిన తెగుళ్లు.. సస్యరక్షణలో రైతులు సతమతం
- వ్యవసాయం జూదంలా మారిందని అన్నదాతల ఆవేదన



రాచర్ల : కొర్ర పంటను కోస్తున్న యంత్రం

మార్కాపురం: రైతు చల్లిన గింజ మొలిస్తేనే మానవాళికి పట్టెడన్నం దొరుకుతుంది! అన్నదాతలు నష్టాలు చవిచూస్తే వ్యవసాయ అనుబంధ రంగాలన్నీ ఒడిదొడుకులు ఎదుర్కొంటాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే రైతులతో వరుణుడు దోబూచులాడటం.. అదును దాటిన తర్వాత వర్షాలు కురవడం.. పంటల సాగు ఆలస్యం కావడంతో దిగుబడిపై పశ్చిమ ప్రకాశంలో రైతులు వ్యాకులత చెందుతున్నారు. మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది జూన్‌లో వర్షాలు పడకపోవడంతో జూలై నెలాఖరులో కురిసిన జల్లులకు రైతులు సజ్జ, కంది, జొన్న, వరి, పత్తి, మిర్చి, పొగాకు పంటలుసాగు చేశారు. నిజానికి జూన్ నుంచి ఆగస్టు నెలాఖరువరకూ ఖరీఫ్ సీజన్ కొనసాగుతుంది. అయితే అదును దాటి వర్షాలు కురవడంతో సెప్టెంబర్ నెలాఖరు వరకు సాగు చేసే పంటలను కూడా ఖరీఫ్ సాగుగానే అధికారులు, రైతులు భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పత్తి, మిర్చి కంది పంటలు వాడుముఖం పట్టాయి. అయితే గత సోమవారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షం రైతుల ఆశలను సజీవంగా ఉంచింది. వరుణుడిపై భారం మోపి పంటలు సాగు చేశామని, వానలు కురవకుంటే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.



మార్కాపురం వద్ద సాగు చేసిన పత్తి

తెగుళ్లతో తంటాలు

పశ్చిమ ప్రకాశంలో అడపాదడపా సాగు చేసిన పంటలను తెగుళ్లు చుట్టుముట్టాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడాల్సి వస్తోంది. వాతావరణ మార్పులతో వరి, మిరప, పత్తిలో తెగుళ్లు అధికమయ్యాయి. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో సాగైన పంటల్లో సూక్ష్మ ధాతు లోపాన్ని అధికారులు గుర్తించారు. వరిలో జింకు లోపం, ఆకుముడత, మిరపలో కుచ్చు తెగులు, పత్తిలో రసం పీల్చే పురుగులు, పచ్చదోమ, తెల్లదోమ అధికంగా ఉన్నాయి. పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టే క్రమంలో పెట్టుబడి భారం అధికమవుతుండటంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొర్ర దిగుబడి ఢమాల్!

రాచర్ల: మండలంలోని ఆకవీడు, జి.కొత్తపల్లి, గుడిమెట్ట, గంగంపల్లె, అచ్చంపేట, జేపీ చెరువు, కోత్తూరు, రాచర్ల, ఒబుల్‌రెడ్డిపల్లె, సత్యవోలు, రాచర్లఫారం, రంగారెడ్డిపల్లె, యడవల్లి, మేడంవారిపల్లె, ఒద్దులవాగుపల్లె గ్రామాల్లో దాదాపు 827 ఎకరాల్లో కొర్ర సాగు చేశారు. చేతికొచ్చిన కొర్ర పంటను రైతులు యంత్రాల సాయంతో నూర్పిడి చేస్తున్నారు. మరికొన్ని చోట్ల కూలీలతో కోయిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా లేకపోవడంతో కొర్ర పంట ఎండుముఖం పట్టి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. అటవీ ప్రాంత పరిసర గ్రామాలైన ఆకవీడు, గంగంపల్లె, ఓబుల్‌రెడ్డిపల్లె, సత్యవోలు, జేపీ చెరువు, రాచర్లలో అడవి పందుల బెడద కారణంగా పంటలకు నష్టం వాటిల్లింది. మొత్తం మీద గత ఏడాది కంటే కొర్ర దిగుబడి తగ్గినట్లు రైతులు చెబుతున్నారు. నల్లరేగడి భూముల్లో ఎకరాకు 4 క్వింటాలు, ఎర్ర నేలల్లో 3 క్వింటాల వరకు దిగుబడి వస్తోందని వివరించారు.

సబ్ డివిజన్‌లో పంటల సాగు వివరాలు..

పంట	మార్కాపురం	తర్లుపాడు	పెద్దారవీడు	కంభం	అర్ధవీడు	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	61.58	174.3	0	188.51	139	563.39
జొన్న	7.68	2.66	0	2.8	1	14.14
సజ్జ	20.46	18	0	137.45	2	177.91
మొక్కజొన్న	10.11	12.8	0	45.01	24	91.92
కొర్ర	9.3	1.25	0	204.5	127	342.05
పెసర	8.82	12.64	0.2	3.71	0	25.37
మినుములు	12.54	3.9	2.16	4.34	3	25.94
కంది	1270	758.12	776.71	124	230	3158.83
నూగు	3.23	0	0.86	145.34	2	151.43
ఆముదం	12.77	2.51	8.46	10.66	67	101.4
పత్తి	2401	58	924.96	84.07	652	4120.03
పొగాకు	450	227	596.14	43.12	143	1465.26
మిరప	901	520.4	1430.36	87.02	793	3731.78
ఉల్లి	0	0	2.02	0	0	2.02
టమోటా	10.22	11.95	65.4	5.44	133	226.01
డ్రై ఫ్రూట్స్	206.79	231.6	126.89	46.2	334	945.48
కూరగాయలు	29.72	3.9	89.53	7.29	15	145.44
పల్ప్ అండ్ టింబర్	13.75	0	0	0	126	139.75
పసుపు	0	0	0	7.6	0	7.6
ఫాడ్డర్ అండ్ కార్ప్స్	96.93	24.1	18.1	0	3	142.13
ఇతర పంటలు	60.98	13.22	24.23	0	26	124.43
పూలు	2.61	0	0	1.29	0	3.9
చెరకు	0	0	0	0.664	0	0.664
మల్బరీ	0	3.54	0	0	0	3.54
మొత్తం	5589.49	2080	4066	1149	2826	15,710.41

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



రైతులు పత్తిలో సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. రసం పీల్చే పురుగులు, పచ్చదోమ, తెల్లదోమ నివారణకు ఇమిడాక్లోప్రిడ్, నీరు 1:4 నిష్పత్తిలో మొక్క లేత కాండానికి బ్రష్‌తో పూయాలి. రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరాకు 300 గ్రాముల ఎసిఫేట్, 80 గ్రాముల థయమిథాక్జామ్‌ను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. జింకు ధాతు లోపం ఉంటే 100 గ్రాముల జింకు సల్ఫేట్‌ను 7 నుంచి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

– దేవిరెడ్డి శ్రీనివాసులు ఏఓ, మార్కాపురం

క్లుప్తంగా

సబ్‌కలెక్టర్, డీఎస్పీని కలిసిన షంషేర్



సబ్‌కలెక్టర్‌ను సన్మానిస్తున్న డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్

మార్కాపురం: మార్కాపురం సబ్‌కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సహదిత్ వెంకట త్రివినాగ్, డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన యు.నాగరాజును ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఏ1 గ్లోబల్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మార్కాపురం డివిజన్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులను సన్మానించారు.

అంగన్‌వాడీలో పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న చిన్నారి

బేస్తవారిపేట: స్థానిక ఇస్లాంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఓ చిన్నారి పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థి జప్పిలిక్లైసర్‌తో కేక్ కట్ చేయించారు. విద్యార్థి తల్లిదండ్రులు ఈపనగండ్ల సిద్దయ్య, రజియా, అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షంషాద్‌బీ, హెల్పర్ శివలక్ష్మి పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు



డీఎస్పీని సన్మానిస్తున్న గురవయ్య, రోజ్‌లిడియా, భాగ్యలక్ష్మి తదితరులు

మార్కాపురం: మార్కాపురం డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన యు.నాగరాజును గురువారం మార్కాపురం డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బూదాల గురవయ్య, ఆదిమూలపు లూకా, రోజ్‌లిడియా, కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, నగేష్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఎస్పీని సన్మానించారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ



సురేష్‌బాబు

పొదిలి: పొదిలి ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈగా సురేష్‌బాబు నియమితులయ్యారు. గురువారం ఆయన తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన మురళీధర్ అనంతపురం బదిలీ కాగా అమలాపురంలో పనిచేస్తున్న సురేష్‌బాబు పొదిలిలో నియమితులయ్యారు. నూతన ఈఈ కార్యాలయ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



ఐలమ్మకు నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

మార్కాపురం: తెలంగాణ ఉద్యమ నాయకురాలు, తొలి భూపోరాటానికి నాంది పలికిన చాకలి ఐలమ్మ ఆదర్శనీయురాలని బీసీ సంఘ అధ్యక్షుడు గోసు సుబ్బారావు పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని గురువారం స్థానిక బీసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు ఆర్.శ్రీనివాసులు, బీసీ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, సీహెచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టల్లో జూనియర్ సివిల్ జడ్జి తనిఖీ



కంది పప్పును పరిశీలిస్తున్న జడ్జి కిశోర్‌కుమార్

మార్కాపురం: స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌ను మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి జె.కిశోర్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. హాస్టల్ సిబ్బందితో కలిసి మరుగుదొడ్లు, స్టోర్ రూమ్, వంటశాలలను, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. భోజన నాణ్యత, వసతి సౌకర్యాలపై విద్యార్థులను ఆరా తీశారు. ఎవరికైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబర్ 15100కు ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు.

కందిలో తెగుళ్లను నివారించాలి



కంభాలపాడు వద్ద కంది పైరును పరిశీలిస్తున్న అధికారులు

పొదిలి: కంది పైరులో వైరస్ వెర్రి తెగులు నివారణకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ ఉప సంచాలకులు టి.సుబ్రహ్మణ్యేశ్వరరావు సూచించారు. గురువారం నగర పంచాయతీ పరిధిలోని కంభాలపాడు గ్రామంలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. పొగాకు, కంది, వరి పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలిచ్చారు. వెర్రి తెగులు నివారణకు ఎకరానికి అర కిలో సల్ఫర్ పిచికారీ చేసుకోవాలన్నారు. వరిలో ఎక్కువగా యూరియా వాడవద్దని తెలిపారు. వరి పొట్ట దశలో పొటాషియం వాడటం మూలంగా గింజ నాణ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రామ మోహనరావు, కృషి విజ్ఞాన కేంద్రం దర్శి కోఆర్డినేటర్ రమేష్, ఏఓ షేక్.జైనులాబ్దిన్, వి.శేషమ్మ, సునీత, రైతులు పాల్గొన్నారు.

మాగుంట పార్వతమ్మకు ఘన నివాళి



పార్వతమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

పొదిలి: మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ భౌతిక కాయాన్ని గురువారం నెల్లూరులోని ఆమె నివాసంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సహకార బ్యాంకు డైరెక్టర్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ కొనకనమిట్ల మండల కన్వీనర్ మోరా శంకరరెడ్డి, పార్టీ జిల్లా సేవాదళ్ కార్యదర్శి మందలపు శ్రీనివాసరెడ్డి(సీసీకేఆర్ శ్రీను) తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మార్గదర్శులు ఉపాధ్యాయులే..



హెచ్‌ఎం సుధాకర్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు

మార్కాపురం టౌన్: విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా మార్గదర్శిగా నిలిచేది ఉపాధ్యాయులేనని బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ పేర్కొన్నారు. గురువారం బీసీ భవన్‌లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న తర్లుపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ముర్తోజు సుధాకర్‌కు అభినందన సభ నిర్వహించారు. బీసీల అభ్యున్నతికి సుధాకర్ సహకారం అందించారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే పోటీపరీక్షలపై అవగాహన కల్పిస్తూ 70 మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందడంలో కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ భవన్ కమిటీ అధ్యక్షుడు గోసు సుబ్బారావు యాదవ్, నాయకులు చెంచయ్య, శ్రీనివాసులుగౌడ్, రమణగౌడ్, నాగార్జున గౌడ్, వంకేశ్వరం శ్రీనివాసులు, రంగారావు గౌడ్, రాంబాబు, కాటంరాజు, వెంకటేశ్వర్లు యాదవ్, రామచంద్రుడు, సీహెచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని అధిగమించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ సుధామారుతి

కొనకనమిట్ల: పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు తక్కువ ఖర్చుతో స్థానికంగా దొరికే ఆహార పదార్థాలు వాడటం ద్వారా మేలు కలుగుతుందని సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. గురువారం మర్రిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషకాహారం, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలతో బాల్య వివాహాలు వ్యతిరేకిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యకర్తలు తయారు చేసిన ఆహార పదార్థాల స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు ప్రసన్న, సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలు పోషకాహారం తీసుకోవాలి

మార్కాపురం రూరల్: బాలికలు పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత బారిన పడకుండా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత సలోమీ పేర్కొన్నారు. రాయవరం కేజీబీవీ విద్యార్థులకు గురువారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, గజ్జలకొండ సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులు సీజ్



అధికారులు స్వాధీనం చేసుకున్న ఎరువు బస్తాలు

గిద్దలూరు రూరల్: మండలంలోని గడికోట గ్రామ పంచాయతీ దేవనగరం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులను స్థానిక వ్యవసాయశాఖ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఏడీఏ డి.బాలాజీనాయక్ కథనం ప్రకారం.. గ్రామంలో అక్రమంగా ఎరువులు నిల్వ ఉంచారని తెలియడంతో ఏఓ విజయ భాస్కర్‌రెడ్డి, సాంకేతిక వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషాతో కలిసి సోదాలు నిర్వహించారు. కొండా శేఖర్‌రెడ్డికి చెందిన గోడౌన్‌లో 399 బస్తాల ఎరువులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఏడీఏ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం గ్రామంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ మారుతీరావు మాట్లాడుతూ.. కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, కిసాన్ మోర్చా మండల శాఖ అధ్యక్షుడు దేగా ఏడుకొండలు, పంచాయతీ కార్మికులు, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలి

కంభం: మండలంలోని రావిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, సత్యనారాయణ ఎయిడెడ్ పాఠశాలను గురువారం ఎంఈఓలు మాల్యాద్రి, శార్వాణి తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు, పారిశుధ్యాన్ని పరిశీలించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రతి పౌరుడికీ సమాచారం పొందే హక్కు

రాచర్ల: సమాచార హక్కు చట్టం కింద ప్రతి పౌరుడికీ ప్రభుత్వ కార్యాలయంలో అవసరమైన సమాచారాన్ని పొందే హక్కు ఉందని వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పత్రాలు తనిఖీ చేయడం, రికార్డుల్లో ఉన్న సమాచారాన్ని చూడడంతోపాటు ఫ్లాపీలు, డిస్కులు టేపులు, వీడియో క్యాసెట్ల రూపంలో సమాచారాన్ని పొందవచ్చని వివరించారు. ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఎంఈవోలు శివకోటేశ్వరరావు, వారణాసి గిరిధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

29న మోడల్ టెట్ పరీక్ష

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో మోడల్ టెట్ పరీక్షను యూటీఎఫ్, డీవైఎఫ్ఐ, కనిగిరి టీచర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 29న నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఐవీ రామిరెడ్డి తెలిపారు. ఎస్జీటీ, బీఈడీ మ్యాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్టుపై మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అర్ధవీడు, బేస్తవారిపేట, కంభం మండలాల టెట్ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్ష విషయమై మూడు మండలాల్లోని మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను సంప్రదించాలని ఓ ప్రకటనలో కోరారు.

మార్కాపురం టౌన్: యూటీఎఫ్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో టెట్ మోడల్ పరీక్షను ఈనెల 29వ తేదీ ఉదయం 9.30 గంటలకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటల్లోపు ఏ పరీక్షకు హాజరవుతారో తెలియజేయాలని సూచించారు. వివరాలకు 99510 68750, 94927 16713ను సంప్రదించాలని కోరారు.

4 నుంచి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

బేస్తవారిపేట: అర్ధవీడు మండలంలోని అయ్యవారిపల్లెలో దసరా సందర్భంగా అక్టోబర్ 4వ తేదీ నుంచి 12 వరకు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి, రెండో బహుమతులు వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 63054 50310, 97018 40836ను సంప్రదించాలని సూచించారు.

3న సీజ్ చేసిన రేషన్ బియ్యం వేలం

గిద్దలూరు రూరల్: సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని అక్టోబర్ 3వ తేదీన ఉదయం 10.30 గంటలకు స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ఎం.అంజనేయరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాడుల్లో 17.20 క్వింటాళ్ల బియ్యం పట్టుబడగా, నిందితులపై 6ఏ కేసులు నమోదు చేశామని చెప్పారు.

పౌర సరఫరాల

గోడౌన్ వద్ద హమాలీల ధర్నా



నినాదాలు చేస్తున్న హమాలీలు

పొదిలి: హమాలీల సంక్షేమం కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక పౌరసరఫరాల గోడౌన్ వద్ద గురువారం హమాలీలు, ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. చట్టం చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రమాదాల బారిన పడుతున్న కుటుంబాలు వీధుల పాలవుతున్నా ప్రభుత్వాలు ఆదుకోవడం లేదన్నారు. 50 ఏళ్లకే పనులు చేయలేని స్థితిలోకి నెట్టబడుతున్న ముఠా కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. పొదిలి సివిల్ సప్లయిస్ స్టాక్ పాయింట్‌ను దొనకొండ నుంచి విడగొట్టి ప్రత్యేక స్టాక్ పాయింట్‌గా ఏర్పాటు చేయడం ద్వారా హమాలీలకు ఉపాధి భద్రత కలుగుతుందన్నారు. 2024 జనవరి నుంచి నూతన వేతన రేట్లు అమలు చేసేలా హమాలీలతో ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు. 60 ఏళ్లు నిండి, పని ఆపేసిన హమాలీల పీఎఫ్‌ను చెల్లించాలన్నారు. ధర్నాలో హమాలీల సంఘ నాయకులు కె.శేషయ్య, కె.ప్రసాద్, కాకర్ల వెంకటయ్య, శ్రీను, నరేంద్ర, దోసపాటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ జట్టుకు తర్లుపాడు విద్యార్థులు



పీఈటీని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

తర్లుపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీల్లో తర్లుపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు. గురువారం నియోజకవర్గ స్థాయిలో మార్కాపురంలో నిర్వహించిన అండర్ 17 బాలికల వాలీబాల పోటీల్లో దీక్ష, వైష్ణవి సత్తా చాటి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్ 17 బాలుర విభాగంలో మౌలాలి, అఫ్రీద్‌బాషా, అజయ్, విష్ణు నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు చెంచయ్య, క్రీడాకారులను హెచ్‌ఎం అభినందించారు.

వృత్తి విద్యా కోర్సులపై విద్యార్థినులకు అవగాహన

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం రాయవరం కేజీబీవీ పాఠశాలలో ఎల్ఎస్‌జే స్కిల్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోఆర్డినేటర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఒకేషనల్ ట్రైనర్ యడవల్లి పూజ మాట్లాడుతూ.. టైలరింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 9, 10, 11, 12 తరగతుల విద్యార్థినులను ఇండస్ట్రియల్ విజిట్‌కు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, ఇన్‌స్టిట్యూట్ హెడ్ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది